సాక్షి
కుమురం భీం
ఆదివారం । 10 । నవంబర్ । 2024



రుద్రాపూర్‌లో సప్తాహం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని చింతల మానెపల్లి మండలంలోని రుద్రాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో సప్తాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. 9లో▸



శతక్కొట్టాడు.. 10లో▸

ఆదిలాబాద్ గల్లీలో బ్యాట్ పట్టాడు. హైదరాబాద్ తరఫున సత్తా చాటుతున్నాడు. ఎస్జీఎఫ్ నుంచి హెచ్‌సీఏ దాకా అంచెలంచెలుగా ఎదిగి టీమిండియా రేసులోకి దూసుకొస్తున్నాడు.

గరిష్టం/కనిష్టం
32.4 /17.8

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం నుంచే చలి మొదలవుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

తెరుకోని జైనూర్..!



జన సంచారం లేక బోసిపోయిన జైనూర్ మార్కెట్

జైనూర్ పరిస్థితి ఇంకా కుదుట పడలేదు. ఘటన జరిగి రెండు మాసాలకుపైగా గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం పరిష్కారమార్గాలను చూపకపోవడంతో సామాన్య ప్రజలతో పాటు కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పత్తి సీజన్ నేపథ్యంలో జిన్నింగ్ మిల్లులు సైతం తెరవక పోవడంతో ఇతర ప్రాంతాల్లో పత్తి పంట విక్రయిస్తున్నారు. దీంతో రైతులపై తీవ్ర ఆర్థికభారం పడుతోంది. అధికారులు స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- ఇబ్బందులు పడుతున్న జనం
- తెరుచుకోని మార్కెట్
- పత్తి విక్రయానికి తప్పని ఇక్కట్లు
- నిత్యావసరాల కొనుగోలుకు ఇతర ప్రాంతాలకు పరుగులు

కెరమెరి(ఆసిఫాబాద్): జైనూర్ మండలంలోని దేవుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళపై హత్యాయత్నం చేసి గాయపర్చిన ఘటన జరిగి 70 రోజులకు పైగా కావస్తోంది. ఘటనను నిరసిస్తూ ఇరువర్గాలు జైనూర్‌లోని పలు దుకాణ సముదాయాలను అగ్నికి ఆహుతి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన జరిగి సుమారు రెండు మాసాలకు పైగా అవుతున్నా జైనూర్ ఇంకా కోలుకోవడం లేదు. కిరాణా, వస్త్ర, హార్డ్‌వేర్ దుకాణాలు, హోటళ్లు, కిల్లీకొట్లతో పాటు ఇతర దుకాణాలు తెరుచుకోకపోవడంతో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇబ్బందుల మధ్య ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 33,470 జనాభా ఉన్నారు. అందులో 7,143 మంది రైతులు ఉన్నారు.

పత్తి రైతులకు తప్పని తిప్పలు..

మండలంలోని అత్యధిక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారికి ప్రధాన పంట పత్తి. ప్రస్తుతం సీజన్ కావడంతో పంట విక్రయించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది జైనూర్ మార్కెట్ యార్డు ద్వారా 84 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. అక్కడ రెండు జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ అలజడుల నేపథ్యంలో అవి తెరుచుకోలేదు. ఫలితంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి పంటను విక్రయించాల్సి వస్తోంది. కొంతమంది ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లులకు వెళ్తుండగా మరికొందరు గ్రామానికి సమీపంలో ఉన్న చిరు దుకాణాల్లో పత్తి విక్రయిస్తున్నారు.

పరిష్కారం చూపని ప్రభుత్వం

గతంలో జిల్లా అధికారులు ఇరు వర్గాలతో మాట్లాడినా ప్రభుత్వం ఇంకా పరిష్కార మార్గాలు చూపడం లేదు. దీపావళి తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు. గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలని ఆది నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ జిల్లాలో ఎక్కడా అమలు ప్రారంభం కాలేదు. 1/70, పేసా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని జీవో 3 పునరుద్ధరించాలని లేదా దాని స్థానంలో నూతన జీవో తీసుకువచ్చి ఏజెన్సీలోని గిరిజన ఉద్యోగాల్లో గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. పోలీసు పహారా యథావిధిగా కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జైనూర్ సమస్యకు పరిష్కార మార్గాలను చూపాలని మండలవాసులు కోరుతున్నారు.

ఇదే అదనుగా భావించి..

అలజడుల కంటే ముందు జైనూర్ మార్కెట్ పెద్ద మార్కెట్. సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన ప్రజలకు ఇక్కడి మార్కెట్‌కు వస్తుండడంతో నిత్యం జనంతో కళకళలాడేది. కానీ సెప్టెంబర్‌లో 4న ఇరు వర్గాలకు చెందిన వారు పలు దుకాణాలను దగ్ధం చేయడంతో రూ. లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. అప్పటి నుంచి ఎప్పుడెప్పుడు తెరుచుకుంటుందా? అని ఎదురుచూస్తున్న క్రమంలో రోజులే కాకుండా మూడుమాసాలు కావస్తోంది. ఇప్పటికీ దుకాణాలు తెరుచుకోకపోవడంతో సమీపంలో ఉన్న జామ్ని, ఉశేగాం, జంగాం గ్రామాల్లో పెద్ద దుకాణాలు వెలిసినట్లు తెలుస్తోంది. జైనూర్ మండలంతో పాటు సమీప మండలాలకు చెందిన ప్రజలు ఆయా దుకాణాల్లోనే దుస్తులు, నిత్యావసరాలు, సరుకులు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తుండడంతో ధరలు కొంతవరకు పెంచినట్లు సమాచారం. ముందే పనులు లేక కూలీలు, పంటల్లో దిగుబడులు లేక రైతులు ఇక్కట్లు పడుతున్న నేపథ్యంలో పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.



మూతబడిన జైనూర్‌లోని జిన్నింగ్ మిల్లు

పకడ్బందీగా కుటుంబ సర్వే

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: రాష్ట్రంలో చేపడుతున్న కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సర్వే నిర్వహణ ప్రక్రియపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు నిరంతరం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లతో పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రక్రియ నిర్వహణ సమయంలో రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులను ఆహ్వానించాలన్నారు. ప్రజలకు వచ్చే అనుమానాలు నివృత్తి చేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఎన్యూమరేటర్లు తమకు ఎలాంటి సందేహాలున్నా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేలో ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ప్రజల సమగ్ర సమాచార సేకరణవల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఇళ్ల జాబితా ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని, ఇదే స్ఫూర్తితో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమమని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలన్నారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్ట చివరి ఇంటివరకు చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిల్లోని అధికారులు సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలివ్వాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే కొరకు జారీ చేసిన బుక్‌లెట్‌లోని మొత్తం అంశాలపై ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. సర్వే ప్రక్రియలో ఇళ్ల జాబితా ప్రక్రియ పూర్తి అయినందువల్ల ఎన్యూమరేటర్లకు సర్వే ఫారాల కొరత లేకుండా చూడాలని, డాటా ఎంట్రీ కేంద్రాలు పూర్తి వసతులతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేసిన బుల్డోజర్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కోట్లు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ఆపేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా సీఎం పర్యటనను అడ్డుకుంటే బుల్డోజర్‌లతో తొక్కిస్తామని వ్యాఖ్యలు చేయడం దిగజారుడు తనమే అవుతుందన్నారు. వెంటనే సీఎం చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హైమద్, నిస్సార్, శ్రీనివాస్, భీమేష్, నారాయణ, బలరాం, అలీబిన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

‘పది’ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదోతరగతి వార్షిక పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించాలని డీఈవో యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 18లోపు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.110, అంతకంటే ఎక్కువ ఉంటే రూ. 125 ఫీజు నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. రూ.50 ఫైన్‌తో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఫైన్‌తో 12 వరకు, రూ.500 ఫైన్‌తో 21 వరకు గడువు ఉందని డీఈవో తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

ఆసిఫాబాద్‌రూరల్: బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ చంద్రశేఖర్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలల హక్కులపై బాలికలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈ నెల 14న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా, గౌతమినగర్‌లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను శనివారం పరిశీలించారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యాజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాల, ఎక్సెల్‌పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సందర్శించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పించాలి



ఓటరు నమోదు ఫారం పరిశీలిస్తున్న ఆర్డీవో

వాంకిడి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటరుగా నమోదు చేసుకునేలా బూత్ స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని ఆర్డీవో లోకేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని సోనాపూర్, గోయేగాం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఫారం 6,7,8 పరిశీలించారు. అనంతరం సోనాపూర్‌లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి మహారాష్ట్ర సరిహద్దులోని లకడ్‌కోట్ చెక్‌పోస్టును సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఆర్ఐ మాజిద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వసుధాశతక పుస్తకావిష్కరణ

ఆసిఫాబాద్‌అర్బన్: భారత్ కల్చరల్ అకాడమీ తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రజాకవి కాళోజి రాష్ట్రస్థాయి కవితా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకసం పద్యకవి, ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయుడు ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధాశతక పుస్తకాన్ని సినీ పాటల రచయిత, దర్శకులు దండనాయకుల సురేష్‌కుమార్, రచయిత శ్రీధర్, రాంబాబు, వెంకటస్వామి, ప్రేమ్‌రాజ్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో వెంకటేశ్వర్లు, చిలుకూరి రాధాకృష్ణాచారి కవిత పఠనం చేశారు. అనంతరం వారిని ప్రముఖ కవులు సత్కరించారు.

‘సమగ్ర’ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభమయ్యే ప్రశ్నావళి సేకరణలో నోడల్ అధికారులు ప్రముఖపాత్ర పోషించాలన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. రోజు వారీగా పూర్తి చేసిన వివరాలను సాయంత్రం 6 గంటల్లోపు అందజేయాలన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే దానిని సవరించాలని, కప్పిపుచ్చేలా పని చేయకూడదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపై ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతిరోజూ సర్వే చేయాలని సూచించారు. రోజువారీగా చేసిన సర్వేకు సంబంధించిన పేపర్లు ప్రతీరోజు ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాల్సిన అవసరం లేదని, అదే సందర్భంలో సూపర్‌వైజర్లు వాటిని తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేపై ప్రజల్లో అపోహాలుంటే వాటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. శని ఆదివారాలు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త వారితో పాటు రెండు మూడు చోట్ల పేర్లు ఉంటే తొలగించుకోవచ్చన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి జిల్లాలో పర్యటించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని, ప్రతీ అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు వనిత, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. సర్వేలో సేకరిస్తున్న ప్రశ్నావళి తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్వే లక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఎన్యూమరేటర్లపై ఉంటుందన్నారు. నిర్దేశించిన ఫారంలో ఇచ్చిన ప్రతీ అంశాన్ని ప్రజల వద్ద నుంచి సేకరించాలన్నారు. అందుబాటులో లేని వారి వద్దకు మరోసారి వెళ్లాలని, ఏ ఇంటిని కూడా వదిలిపెట్టవద్దన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది ఉన్నారు.

నిషేధమా.. ఎక్కడ?



జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో వినియోగిస్తున్న పాలిథీన్ కవర్లు

- జిల్లాలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- పొంచి ఉన్న ప్రమాదం

ఆసిఫాబాద్: జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. హోటళ్లు, కిరాణం, మటన్, చికెన్, కూరగాయల దుకాణాల్లో ప్రతిరోజు జిల్లాలో పాలిథీన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు వినియోగంలోకి వస్తున్నాయి. గతంలో ప్రజలు కిరాణా సామాన్లతో పాటు ఇతర సామగ్రి, కూరగాయల కొనుగోలుకు సంచులు వినియోగించే వారు. మారుతున్న పరిస్థితుల ప్రభావంతో సంచుల వినియోగం తగ్గిపోయి ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగింది. పాలిథిన్ కవర్ల వినియోగం పర్యావరణానికి ప్రమాదకరంగా మారింది. ఈక్రమంలో మహాత్మాగాంధీ 150వ వర్ధంతిని పురస్కరించుకుని ఐదేళ్ల క్రితం ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ‘స్వచ్ఛతహీ సేవా’ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 50 మైక్రాన్లకంటే తక్కువ మందం గల ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. కిరాణా, జనరల్, బట్టల దుకాణాలతో పాటు నిత్యం వినియోగించే పాలు, మంచినూనె నుంచి టీ వరకు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు.

అవగాహన కరువు

ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల జరిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన లేక పోవడం వల్లనే నిత్యం వీటిని ఉపయోగిస్తున్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగిపోయింది. ప్రతిరోజు జిల్లాలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యావరణానికి హాని

నిత్యం ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలుచగా ఉండే ప్లాస్టిక్ కవర్లను వాడటం, దీన్ని రీసైక్లింగ్ చేసే అవకాశం లేక పోవడంతో భవిష్యత్‌లో పెను ప్రమాదకరంగా మారనుంది. దీనివల్ల భూసారం కోల్పోవడమే కాకుండా మానవాళితో పాటు జంతువులు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు చెత్త కుండీల్లో, మురికి కాల్వల్లో వేయడంతో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ సంచులకు తళతళలాడే రంగుని ఇవ్వడానికి ఉపయోగించే రంగులు, పిగ్‌మెంట్లలో క్యాన్సర్ కలుగజేసే పదార్థాలున్నాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇందులో ఉండే కాడ్మియం వంటి బరువైన ధాతువులతో అనారోగ్యానికి గురవుతున్నారు. ప్లాస్టిక్ వర్షపు నీటిని ఇంకనీయకుండా చేస్తుంది. దీంతో భూసారం తగ్గుతుంది. ప్లాస్టిక్ సంచులు, వస్తువులు కాల్చివేసే సందర్భంలో వెలువడే వాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతినే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటల్లో ప్లాస్టిక్ కలిసిన నీటిని తాగితే పశువులు అనారోగ్యం పాలవుతాయి. ప్లాస్టిక్ కోర్లో ఫ్లోరో కార్బన్ లాంటి రసాయన పదార్థాలు ఉండటం వలన అవి పర్యావరణంలో కలిసి పోకుండా విషపూరితమైన రసాయనాలు వెదజల్లుతున్నాయి. దీంతో పీల్చేగాలి కాలుష్యంగా మారి ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులతో పాటు పలురకాల వ్యాధులు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

యథేచ్ఛగా కవర్ల వినియోగం

దశలవారీగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని భావించిన ప్రభుత్వం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజల్లో ఆశించిన మార్పు కానరావడం లేదు. మూడేళ్లక్రితం అధికారులు తనిఖీలు నిర్వహించి వ్యాపారులకు జరిమానా విధించారు. దీంతో కవర్ల వినియోగం కొంత వరకు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మార్కెట్‌లో యథావిధిగా పాలిథీన్ కవర్ల వినియోగం జరుగుతోంది. కూరగాయల మార్కెట్‌లో బహిరంగంగానే కవర్లు వినియోగిస్తున్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు

పాలిథీన్ కవర్ల వాడకంపై నిషేధం ఉంది. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుడ్డ సంచులనే వినియోగించాలి. వ్యాపారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగం మానాలి. ప్లాస్టిక్ కవర్లు వాడితే వ్యాపారులకు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– భుజంగరావు, మున్సిపల్ కమిషనర్

‘పొలంబాట’తో సమస్యలకు సత్వర పరిష్కారం

- విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావు



నంబాలలో మాట్లాడుతున్న ఎస్ఈ శేషారావు

రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యుత్ శాఖ చేపట్టిన పొలంబాట కార్యక్రమం ద్వారా రైతాంగానికి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని ఎస్ఈ శేషారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 33బై11కేవీ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం నంబాలలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పొలాల వద్ద రైతులు వి ద్యుత్ ప్రమాదాల బారిన పకుండా నాణ్యమైన మో టర్లు, స్టార్టర్లు, ఫ్యూజులతో పాటు ఇతర సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. కెపాసిటర్లు అమర్చుకోవడం ద్వారా మోటర్లు మరింతకాలం మన్నికగా ఉండడంతో పాటు లోవోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని రైతులకు సూచించారు. హార్వెస్టర్ యంత్రాలను విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఈ జీవరత్నం, ఏఈ ఇమ్రాన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రక్షణలో ఏరియాను ప్రథమస్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వర్తించి ఏరియాను ప్రథమస్థానంలో నిలపాలని ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని విభాగాల అధికారులతో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలోని గనుల్లో ఉద్యోగుల రక్షణకు సింగరేణి సంస్థ పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. ప్రతీ ఉద్యోగికి రక్షణ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులు ఇంటి నుండే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కళాకారుల పాటలు, నాటికల ద్వారా రక్షణ ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కై రిగూడ పీవో నరేందర్, ఏరియా ఇంజినీరు భీంరావు జాడే, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదృశ్యం


పోశయ్య

దహెగాం: మండలంలోని మొట్లగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు ఎనగందుల పోశయ్య అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 10న పోశయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లల్లో, చుట్టూ పక్క గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. కుమారుడు రమేశ్ ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి వచ్చారని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన దేవుల్ల శంకరమ్మ ఇల్లు శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. ఇంటో వస్తువులు, తిండిగంజలు, బట్టలు కాలి బూడిదయ్యాయి. రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితురాలు శంకరమ్మ తెలిపింది. దగ్ధమైన ఇంటిని శనివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సందర్శించి బాధితురాలిని పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుమలగౌడ్, కిరణ్‌కుమార్, వెంకటేష్, అబ్దుల్లా, ప్రకాశ్, అభిరామ్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు. బాధితురాలిని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు రఫీ, వెంకన్నయాదవ్, దేశ్‌ముఖ్, రాకేష్ పాల్గొన్నారు.

రెండోరోజు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు రెండోరోజు కొనసాగాయి. బాల,బాలికల విభాగంలో ప్రీక్వార్టర్స్ పోటీలు శనివారం రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 48 జట్లు దాదాపు 850 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. నెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, సెక్రటరీ ఖాజాఖాన్, కోశాధికారి సోహెల్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నపూర్ణ, జమున, వన్నెల భూమన్న తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. ఆదివారంతో ఈ పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన ఏసీపీ రవికుమార్
- ఉమ్మడి 9 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు


ఫైనల్‌కు చేరిన ఆదిలాబాద్ జిల్లా జట్టు


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికలు

బెల్లంపల్లి: పట్టణంలోని సింగరేణి తిలక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలను ఏర్పాటు చేశారు. ఆదివారం వరకు పోటీలు కొనసాగుతాయి. ఉమ్మడి 9 జిల్లాల నుంచి బాలికలు, బాలుర జట్లు హాజరు కాగా, 360 మంది క్రీడాకారులు, 40మంది టీమ్ మేనేజర్ కోచ్‌లు పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రమశిక్షణను, పోటీతత్వాన్ని నింపుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19 విభాగం సెక్రెటరీ బి.బాబురావు మాట్లాడుతూ క్రీడాకారుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొలిరోజు ఆదిలాబాద్-రంగారెడ్డి జిల్లాల బాలుర, హైదరాబాద్-నిజామాబాద్ జిల్లాల బాలికల జట్లు తలపడ్డాయి.

ఫైనల్‌కు ఆదిలాబాద్ జిల్లాజట్టు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ఆరంగ్రేట్రం చేసింది. అత్యుత్తమంగా ఆడి ఫైనల్‌కు చేరింది. నిజామాబాద్ జిల్లా బాలుర జట్టుపై 7-0 స్కోర్‌తో మొదటి సెమీఫైనల్ పోటీలో విజయం సాధించింది. మెదక్-మహబూబ్‌నగర్ జిల్లాల బాలుర జట్లు సెమీఫైనల్ చేరాయి. ఆయా జట్ల మధ్య ఆదివారం సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుపై ఆదిలాబాద్ బాలుర జట్టు తుది పోరులో తలపడనుంది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రాంమ్మోహన్, రవి, యాకూబ్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, స్వామి, సంతోష్, శ్రీనివాసరెడ్డి, చాంద్‌పాషా, చిన్నక్క, యాదగిరి, పరిశీలకులు గంగమోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటుతాం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా అతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. సుదూర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొని ఉత్సాహంగా ఆడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా జట్టు గెలుపు సాధించడానికి స్థానిక పరిస్థితులు అనుకూలిస్తాయని భావిస్తున్నాం. ప్రతిభ ఉన్న క్రీడాకారులు జట్టులో ఉండటం కొండంత బలాన్నిస్తోంది. – రాజ్‌పేటి విక్కీ, ఆదిలాబాద్

సంతోషంగా ఉంది



హైదరాబాద్ చుట్టుపక్క ప్రాంతాల్లో మాత్రమే ఆడాం. ఈసారి కోల్‌బెల్ట్ ప్రాంతమైన బెల్లంపల్లికి రావడం కొత్త అనుభూతిని ఇస్తుంది. మా జట్టంతా ఉత్సాహంగా ఉంది. ఆటల్లో విజయం సాధించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం. స్థానిక క్రీడాకారులు, ప్రజలు తమను ప్రోత్సహించడం మరువలేం. – బి.వేణు, హైదరాబాద్

కొత్త పరిచయాలు



ఇతర జిల్లాల క్రీడాకారులతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. కొత్తపరిచయాలతో క్రీడల్లో మెరుగ్గా రాణించాలని అనుకుంటున్నాం. జట్టు సమష్టి కృషితో ఆడి విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ పట్టుదలతో ఉన్నాం. – కె.అజయ్, ఆదిలాబాద్

పట్టుదలతో ఆడుతున్నాం



సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు గెలుపు కోసం పట్టుదలతో ఆడుతున్నాం. ఆటలో నైపుణ్యత కనబరిస్తే విజయం వరిస్తుంది. జాతీయ స్థాయిలో తాను ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆడాను. అదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం. – టి.నేహశ్రీ, నిజామాబాద్

ఏ జట్టును తేలికగా తీసుకోం



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ప్రతి జట్టులో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారు. ఏ జట్టును మేము తేలికగా తీసుకోబోం. అన్ని జట్లను సమానంగానే చూస్తాం. తుది వరకు పోరాడి విజయం సాధించడానికి కృషి చేస్తాం. – సీహెచ్.మానస, మెదక్

స్ఫూర్తిదాయకమైన ఆట ప్రదర్శిస్తాం



క్రీడల్లో గెలుపోటములు సహజం. జిల్లా జట్టు స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించడానికి ప్రాధాన్యత ఇస్తాం. నేను ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. అనుభవంతో ప్రత్యర్థి జట్ల బల, బలాలను బేరీజు వేసుకుని ఆడుతాం. – ఎం.వర్షిత, మహబూబ్‌నగర్

వలస కార్మికుల చట్టాల సదస్సుకు జిల్లావాసి

నిర్మల్‌ఖిల్లా: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 8 నుంచి 10 వరకు కొనసాగనున్న అంతర్జాతీయ వలస కార్మికుల చట్టాలు-రక్షణ సదస్సులో జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటున్నారు. అంతర్జాతీయ వలస కార్మిక చట్టాల ద్వారా కార్మికుల రక్షణపై అవగాహన బి.ఎం.డబ్ల్యూ అండ్ సాస్క్..నేపాల్, భారత్ దేశాల్లో నిర్వహిస్తున్న ప్రాజెక్టు కార్యక్రమాలు తదితర అంశాలు ఈ సదస్సులో చర్చిస్తున్నట్లు స్వదేశ్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టం-1983కు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరణలు అవసరమని, గల్ఫ్ దేశాల్లో కార్మికులు మృతిచెందుతున్న నేపథ్యంలో ప్రవాసీ భారతీయ బీమా యోజన వర్తింపజేయాలని యూనియన్ తరపున నివేదించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆయనతోపాటు నిజామాబాద్ జిల్లా సమన్వయకర్త దీకొండ కిరణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీడబ్ల్యూఐ దక్షిణాసియా పాలసీ అధికారి రాజేష్‌శర్మ, ప్రోగ్రాం అధికారి ప్రేరణ ప్రసాద్ గుప్తా, నేపాల్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ నుంచి జయవిద్యా, సామ్రాట్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

కెరమెరి: పత్తి చేనులోంచి 45 పైపులను ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన నాగోసే సత్తయ్య, మొహర్లే జానకీరావులకు చెందిన పత్తి చేల నుంచి గత నెల 12న గోయగాంకు చెందిన గావ్రత్రె గణపతి, వాంకిడి మండలం లంజన్వీరకు చెందిన వాడై సుందరంల 45 నీటిపైపులను ఎత్తుకెళ్లారు. కెరమెరి పోలీసులు పట్టుకుని పైపులను స్వాధీనం చేసుకుని సిర్పూర్ కోర్టులో హాజరుచర్చగా శనివారం మెజిస్ట్రేట్ 14 రోజులు జ్యూడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

గొడ్డలితో నరికి ఒకరి హత్య

- ముత్తరావుపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు


మల్లయ్య మృతదేహం

చెన్నూర్‌రూరల్: గొడ్డలితో నరికి ఒకరిని హత్య చేసిన ఘటన మండలంలోని ముత్తరావుపల్లిలో చోటుచేసుకుంది. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లయ్య(50), భార్య మల్లక్క, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు పైడిపల్లి రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను ఇష్టపడి ఏడు నెలల క్రితం వెళ్లిపోయి సహజీవనం చేస్తున్నారు. భార్య కనిపించడం లేదని భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రాజశేఖర్, సౌందర్యను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ సౌందర్య భర్తతో ఉండనని ప్రియుడు రాజశేఖర్‌తోనే ఉంటానని చెప్పి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజశేఖర్ కుటుంబంపై భూమయ్య పగ పెంచుకున్నాడు. రాజశేఖర్ తండ్రి మల్లయ్య శనివారం బహిర్భూమికని గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లగా అక్కడే వేచి ఉన్న భూమయ్య గొడ్డలితో నరికి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పెద్ద కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

భైంసారూరల్: మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ద్యారంగుల హన్మంతు(38) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన సయ్యద్ కలీం (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ సయ్యద్ ఇసాక్ అలీ కథనం ప్రకారం..శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎరోడ్రమ్ మైదానంలో పురుగుల మందు తాగి కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గత రెండేళ్లగా మద్యానికి బానిసైన కలీం జీవితంపై విరక్తితో ఈ అఘయిత్యానికి పాల్పడినట్లుగా వివరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్-17 జిల్లాస్థాయి బాలికల హాకీ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు ఈ పోటీలను ప్రారంభించారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11 నుంచి 13వ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రవీందర్, హరిచరణ్, శ్రీనివాస్, త్రివేణి, అశోక్, మహమ్మద్ తదితరులు ఉన్నారు.

సెమీస్‌లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు

ఆదిలాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లిందని కోచ్ అరవింద్, మేనేజర్ స్ఫూర్తి, వివేక్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన బాలికల జట్టుకు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పీడీ హరిచరణ్‌లు అభినందనలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటకు చెందిన వివాహిత లత వరకట్న వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి శనివారం విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి పోగుల మల్లీశ్వరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఐ సైదరావు, ఎస్సై శంకర్ తదితరులు ఉన్నారు.

పథకం ప్రకారం హత్య చేశారని..

మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మృతురాలు తల్లితోపాటు పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి మాట్లాడారు. అదనపు కట్నం కోసం లతను భర్త నాగరాజు, అత్తమామలు సత్తవ్వ, వెంకటి వేధించారన్నారు. పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు రాజగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు అభినవ్, గంగారెడ్డి, సుదర్శన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్.. ప్లాస్టిక్ ఫ్రీజోన్

- అటవీశాఖ ప్రత్యేక దృష్టి
- 'టైగర్ రిజర్వు'లో ప్లాస్టిక్ నిషేధం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ప్లాస్టిక్ వస్తువులతో అటవీ సిబ్బంది

జన్నారం: కవ్వాల్ టైగర్ రిజర్వు (కేటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్ ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ఏర్పాటు చేశారు. గత జూలై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చింది. ఈక్రమంలో అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకం కొంత తగ్గింది. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో భాగంగా ఆడపదడపా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను సిబ్బంది తొలగిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మధ్యలో జన్నారం మండలం ఉంది. ప్రయాణికులు అటవీప్రాంతం గుండా వివిధ గ్రామాలకు వెళ్తుంటారు. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందినవారు వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ప్లాస్టిక్ సంచుల ద్వారా ఆహారం, తినుబండరాలు తీసుకెళ్తూ పాడేస్తున్నారు. వీటితో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉంది. కాగితపు, జనపనార సంచులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని అధికారులు వ్యాపారులకు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని వారికి నోటీసులు జారీ చేశారు. ప్రజలు, పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

పంచాయతీకి అప్పగింత

జన్నారం అటవీ డివిజన్‌లో నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నారు. రేంజ్ అధికారి నుంచి మొదలు, బేస్‌క్యాంపు సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారు. ప్లాస్టిక్‌వస్తువులను సేకరించి బస్తాల్లో నింపి గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు వందల సంఖ్యలో బస్తాలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు పంపినట్లు పేర్కొంటున్నారు.

నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత



జన్నారం అటవీ డివిజన్‌లో ప్లాస్టిక్ వస్తువులు పడేయొద్దు. ఉన్నతాధికారుల ఆదేశాలతో షాపుల యజమానులు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాం. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నాం. – సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు

సారంగపూర్: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రాణాపూర్ సమీపంలో శుక్రవారం రాత్రి నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆవును ఢీకొట్టగా తీవ్రంగా గాయపడింది.డ్రైవర్ బస్సును నిలపకుండా వెళ్లాడు. ఆగ్రహించిన గ్రామస్తులు ఆడె శ్రీనివాస్, మోహన్‌నాయక్‌లు వెంబడించి బస్సును నిలిపివేయించారు. డ్రైవర్‌తోపాటు కండక్టర్‌ను దాడిచేసిన ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేసి నిర్మల్‌కోర్టులో హాజరుపర్చగా, 11రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: వెల్డింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన సర్దార్‌ఖాన్ (53) శుక్రవారం మహారాష్ట్రలోని పాంఢ్రకవడలోని మహా ఆశ జిన్నింగ్ మిల్లులో వెల్డింగ్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిల్లు సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా రాజ్‌గడ్‌కు చెందిన లోకండే ప్రమోద్ (30) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 4న ఇంట్లో పురుగుల మందు తాగగా కుటుంబీకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమోద్.. గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఆశించిన స్థాయిలో పంటలు పండక కుటుంబీకులు చదివించలేని స్థితిలో ఉండటంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ వినాయక్‌రావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న


నిరసన తెలుపుతున్న జోగు రామన్న, జనార్దన్

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తన పుట్టినరోజు వేరే వాళ్ల చావులను కోరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ గౌస్ ఆలంను కలిసి ఫిర్యాదు చేశారు. నిరసనలో జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పార్టీ నాయకులు అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేశ్, దాసరి రమేశ్, కొండా గణేశ్, పవన్ నాయక్, దమ్మాపాల్, బట్టు సతీశ్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో హమాలివాడ రైల్వే ట్రాక్ పక్క నుంచి శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన సింగరేణి ప్యాసింజర్ రైలు ఢీకొంది. ఆయన తలకు తీవ్రగాయాలు కాగా ట్రాక్‌మెన్ మల్లేశ్ గమనించి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని, వివరాలకు తెలిసిన వారు 8712658596, 9701112343 సెల్‌నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు.

హత్యకు సహకరించిన వ్యక్తి రిమాండ్

భీమిని: కన్నెపల్లి మండలం సాలిగాం పంచాయతీలో గోమాస నరేందర్ హత్యకు సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గత అక్టోబర్ 15న సాలిగాం గ్రామంలో అల్లుడు గోమాస నరేందర్ వేధింపులు భరించలేక మామ గోలేటి శంకర్ అతన్ని గొడ్డలితో దాడి చేసి హత్యచేశాడు. మామ శంకర్, అత్త లక్ష్మి, భార్య భవాని అలియాస్ బేబిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. హత్యకు సహకరించిన భీమారం మండలం లంబడితండాకు చెందిన బానోతు రాము పాత్ర ఉందని తెలడంతో శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నగదు, బైక్‌తో యువకుడు పరారీ

ఇంద్రవెల్లి: నగదు, బైక్‌తో యువకుడు పరారీ అయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం శాంతపూర్‌కు చెందిన వ్యాపారి సాబ్లే జైరాం అదేగ్రామానికి చెందిన బస్సి ఓంకార్‌లు మొక్కజొన్న పంట కొనుగోలు చేయడానికి శనివారం ఇంద్రవెల్లి మండలం బుర్సన్‌పటర్‌కు బైక్‌పై వచ్చారు. సాబ్లే జైరాం రైతుల వద్దకు వెళ్లి మొక్కజొన్న నాణ్యత, తేమశాతం చూస్తున్నాడు. ఆ సమయంలో బైక్‌తోపాటు అందులో ఉన్న రూ.4.20 లక్షల నగదుతో ఓంకార్ పరారీ అయ్యాడు. జైరాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.